'ఏయ్, ఏయ్, ఆట పోయినా ఆడతావేమే?' కళ్ళు పెద్దవి చేసి మూతి బిగించి అడిగింది శైల.

'ఎక్కడ పోయిందే! కాయయినా కదల్లేదుగానీ. . .' దీర్ఘం తీస్తూ, ఆట ఆపకుండా పట్టిన చింతపిక్కలని రెండో చేతిలో ఎంచి వేసుకుంటూ అరిచింది వసంత.

'ఎందుకే అన్యాయం? ఇది మూడో సారే. నువ్వు ఆట పోయినా ఇవ్వకుండా ఆడటం. . . ఛీ పో వెధవ అన్యాయపు ఆట. నే నాడను పో. . .' పరికిణీ దులిపి లేచి నించుంది శైల.

'నా ఆట పోలేదనీ, కాయలన్నీ నా కొస్తున్నాయని కుళ్ళు.' మూతి తిప్పుకుంటూ అంది వసంత.

'అవునవును! నా వేమో ఆరు గుజ్జాలు. నీ వేమో రెండే నయ్యే. మరి నీకు ఎక్కువున్నాయని కదూ నాకు కుళ్ళు!' జడ ముందు వేసుకుని కళ్ళు తిప్పుకుంటూ బుగ్గలు పూరించి నవ్వింది శైలజ.

వసంత ఒళ్ళు కారం రాచుకున్నట్టు చిమచిమ లాడింది. చింత పిక్కలన్నీ కలిపి పారేసింది. 'పో, పో! నీతో ఆడిన వాళ్ళు గాడిదలే. ఇంక ఒట్టే ఒట్టు!

'పోవే, పో. నీతో మాత్రం ఎవరాడతారు అన్యాయపు సుద్ద. పో పో!' వంగి చింతపిక్కలన్నీ డబ్బాలో పోస్తోంది శైల.

'అంత పోవాలనుంటే నువ్వే పోవే. ఇది మా ఇల్లు. నువ్వేపో మీ మహారాజ భవనానికి. అయినా నువ్వెందుకు పోతావులే! మా సొమ్ము తింటూ ఇక్కడే పడుంటావు గానీ. . .' కసిగా శైలజ వేపు చూసి పరుగెత్తుకు పోయింది వసంత.

వసంత పరుగెత్తిన వైపే చూస్తున్న శైల కళ్ళు నీటితో నిండిపోయినాయి. మొహం రోషంతో, అభిమానంతో ఎరుపెక్కి, పెదవులు బిగుసుకున్నాయి. చేతిలోని చింతపిక్కను డబ్బాని విసిరికొట్టి పరుగెత్తుకొంటూ వెళ్ళి, వసారాలో, కూర్చుని కూరలు తరుగుతున్న పార్వతి మెడ వాటేసుకుని, వీపులో తల దాచుకుని ఒక్కసారిగా బావురుమంది తొమ్మిదేళ్ళ శైలజ.

'ఏమిటే? ఏమయింది? ఒసే శైలూ ఏముందమ్మా?' కత్తిపీట పక్కకి పెట్టి శైలాని ఒళ్ళోకి తీసుకుని బుజ్జగించింది పార్వతి.

'మనింటికి వెళ్ళిపోదామమ్మా. ఇక్కడ పిన్నింట్లో ఉంటే ఉండద్దు.' ఏడుపుతో మాటలు పెగిలిరాక పార్వతి గుండెల్లో తల దాచుకుంది శైల.

## కెలీడో స్కోపు

భాగాలు పంచుకొని
బంధాలు తెంచుకొని
ఒకడు

గూటిలో గువ్వలా
గుడిసెలో అవ్వలా
వేరొకడు

అత్తల్ని నమ్ముకొని
ఆత్మల్ని చంపుకొని
కొందరు

ప్రాయాన్ని అమ్ముకొని
గాయాన్ని రేపుకొని
ఎందరో

ఉన్నది కరుగక
తిన్నది అరుగక
కొందరు

జీవితం భారమై
చింతతో శల్యమై
మరెందరో

రెక్కల్ని విప్పుకొని
చుక్కల్ని చీల్చుకొని
కొందరు

చీకట్ల నగరాన
వాకిళ్ళు తట్టుతూ
అందరూ

—కోట రాధాకృష్ణమూర్తి

గుమ్మం పక్కగా కూచుని చిక్కుడు కాయలు వలుస్తున్న ఆదెమ్మగారు ఖంగారు పడింది. ఆవిడ కసలే బ్లడ్ ప్రెషర్‌జబ్బు. ఏ కొస్త దానికయినా ఖంగారు, హడావిడి.

'ఏమయిందే, అమ్మా, ఇంతలో! నా బంగారు తల్లివి కదూ! చెప్పవే? ఇప్పటి వరకు నువ్వు, వసంత ఆడుతున్నారు. కదే? ఒక్క నిమిషంలో ఏమయిందే? ఒసేయ్ వసూ, వసూ, ఇట్రా ఏడు' అంటూ ఖంగారు పడసాగింది ఆదెమ్మ గారు.

ఈ హడావిడి విని అటుగా వచ్చిన రాధమ్మ పార్వతి ఒడిలో ఏడుస్తున్న శైలాని చూసి, 'ఏమయింది వదినా?' అంటూ కత్తిపీట తీసుకుని కూరల ముందు కూర్చుంది.

'ఏం దెబ్బ లాడుకున్నారో, ఏమిటో మరి! మనింటికెళ్ళి పోదాం, ఇక్కడ ఉండద్దంటూ ఏడుస్తోంది' అంటూ శైలని పక్కన కూచో పెట్టుకుని కళ్ళు తుడుస్తూ, బుజ్జగించి సంగతి తెలుసుకుంది పార్వతి.

'అంతా బాగుంటే మీ నాన్న అట్లా ఎందుకుండేవాడే, నా తల్లీ! మీ అదృష్టాలు ఇంత లక్షణంగా ఉన్నాయి కాబట్టే ఆయన బుద్ధులట్లా ఉన్నాయి. ఇంతే చేసి పెట్టామనుకో. రాసి పెట్టిందే అనుభవించాలి. మీ రంతా ముచ్చటగా కలిసుంటే చూసే అదృష్టం మాకు మాత్రం ఉండద్దూటే . . .' ధోరణిగా పురాణం చదువుతున్న ఆదెమ్మగారిని— 'మీరుకూడా ఏమిటి! చిన్నపిల్ల అదసలే ఏడుస్తుంటేనూ' అంటూ అత్తగారి ధోరణి కప్పపడి, 'ఒసే శైలూ మంచి పిల్లలు ఎక్కడయినా ఏడుస్తారా? ఏదీ, శైలం బంగారు కొండమ్మా! వసూ కనపడనీ, ఈ వేళ దాని పని చెబుతాను' అంటూ శైలాని ఓదార్చి అవతలికి పంపింది రాధమ్మ. ఆ చిన్న గుండెల్లో గూడు కట్టుకుంటున్న బాధని చూసి భారంగా నిట్టూర్చింది పార్వతి.

* * *

శైలా పక్కగా మంచం మీద పడుకున్న పార్వతి నిద్ర పట్టక అటూ, ఇటూ కదులుతూంది. గతంలోకి పరుగు పెట్టుతున్న మనసు గడిచిన దినాల జ్ఞాపకాలలో మునిగిపోయింది.

రఘురామయ్యగారికి ముగ్గురు కూతుళ్ళు, ఒక కొడుకు. ఆఖరి అయిన పార్వతి అతి గారాబంగా పెరిగింది తండ్రి దగ్గర. ఆదెమ్మగారికి పిల్లలంటే పంచ ప్రాణాలూను. చదువులో, ఇంటి పనుల్లో కుట్లు అల్లికల్లో అతి చురుకయిన పార్వతి ఏ పని చేసినా, నేర్పరితనం కొట్టవచ్చినట్టు కనిపించేది. థర్డ్ ఫారం చదువుతున్న పార్వతికి అతి ఘనంగా వివాహం జరిపించారు రఘురామయ్యగారు. ఉత్సాహంగా, సరదాగా నలుగురితో కలిసిపోయి, పరిహాసా లాడుతూ తిరిగే శంకరాన్ని చూసి అంతా గర్వించారు. ఛాయ తక్కువయినా కళ గల మొహం అన్నారు. మొహంలో సిరి తాండవిస్తోందన్నారు. పెద్దగా ఆస్తిపాస్తులు లేకపోయినా అమూల్యమయిన చదువు ఉంది. కనక మంచి ఉద్యోగస్థుడవుతాడన్నారు. అందరి వాక్కులు ఫలించి పెళ్ళి జరిగిన కొద్ది కాలంలోనే మంచి ఉద్యోగంలో స్థిరపడి, పార్వతిని తీసుకుని కలకత్తా వెళ్ళిపోయాడు శంకరం. పెళ్ళి జరిగిన కొద్ది రోజుల్లోనే పార్వతి అన్నగారైన మూర్తి, శంకరం ఆప్తమిత్రులయిపోయారు. చెల్లెల్ని, శంకరాన్ని రైలెక్కించిన మూర్తి ఆడపిల్లలాగా బావురుమన్నాడు.

మూడు పువ్వులు ఆరు కాయలుగా కన్నపిల్లల సంసారాలు జరిగి పోతుండగా, వ్యాపారాన్ని మూర్తి చేతుల్లో అప్పగించి, నిశ్చింతగా కళ్ళు మూశారు రఘురామయ్య గారు. జీవం లేని కట్టెలా మిగిలిన ఆదెమ్మగారు, పిల్లల్ని చూసే సంతృప్తి పడసాగారు. విధి వక్రించి మూర్తి వ్యాపారం మునిగిపోయే స్థితిలో ఉండగా తనకున్న మూడు ఎకరాల పొలాన్ని అమ్మి మూర్తి నాదుకున్నాడు శంకరం. వ్యాపారంలో కాలూ చెయ్యీ కూడదీసుకున్న మూర్తి మనసులో ఆపదలో ఆదుకున్న ప్రాణదాతగా శంకరం నిలిచిపోయాడు.

కాలం మెల్లగా నడుస్తూ చల్లగా సాగుతున్న పార్వతి సంసారంలో అల్లకల్లోలం రేపింది. కొద్ది రోజులుగా అతి దీర్ఘాలోచనాపరుడయిన శంకరానికి మతి చలించిందని పార్వతి ఇచ్చిన టెలిగ్రాము చూసి మూర్తి కలకత్తా పరుగెత్తాడు. తననికూడా గుర్తించలేని శంకరం శూన్యపు చూపుల్ని, అతని పిచ్చి చేష్టల్ని చూసి మూర్తి తల్లడిల్లిపోయాడు. కంటికి కడివెడుగా దుఃఖిస్తున్న చెల్లెల్ని చూసి మూర్తి హృదయం ఆవేదనతో అల్లకల్లోలమయింది. చెల్లెలి శంకరాన్ని తీసుకుని స్వంత ఊరు చేరాడు. చెయ్యని వైద్యం, మొక్కని దేవుడు లేదన్నట్లుగా అన్నీ చేసి చూశారు. కరంటు ట్రీటుమెంటు కూడా ఇచ్చి చూసిన తరవాత శంకరంలో కొంచెం మార్పు కనపడసాగింది. అంతటి చలాకీ మనిషి అతి ముభావంగా మారిపోయాడు. రెండో మనిషినీడకూడా సహించలేనట్లు ప్రవర్తించేవాడు. తన చుట్టూ గీసుకున్న పరిధిలో ఏ ఒక్కరు ప్రవేశించజూచినా సహించలేకపోయేవాడు. రోజంతా దేన్ని గూర్చి ఆలోచిస్తూ ఉండేవాడో ఎవరూ ఊహించలేకపోయారు. రోజులూ, నెలలూ, సంవత్సరాలు గడిచి పోతున్నాయి. మూర్తి సంసారం పిల్లా, పాపలతో పెరిగి పెద్దదవుతూంది. అదృష్టం కలిసివచ్చి వ్యాపారం మూడు పువ్వులూ, ఆరు కాయలుగా సాగిపోతూంది. పేరుపడ్డ వ్యాపారస్థుడుగా కాలు నిలదొక్కుకున్నాడు మూర్తి.

ముద్దూ ముచ్చటా లేని కూతురు సంసారాన్ని చూసి ఆదెమ్మగారు కుమిలిపోతూ ఉండేది. పార్వతి కడుపున పెళ్ళయిన పదేళ్ళ లోనూ ఒక్క కాయ అయినా

# శైలజ




—షీలా శివరామ్

ఆలోచనలు, కళ్లు మూత పడనివ్వటం లేదు.

• • •

అమ్మ మరి రోజూ దేవుడికి పూజ చేస్తుంది గదా? మరి తమకి ఆ దేవుడు డబ్బెందు కివ్వలేదు, మామయ్యా వాళ్లకి లాగా?

నాన్నని అంతా తిక్క శంకరయ్య అంటారు. మరి నాన్న తనకి ఎంచక్కా కబుర్లు, కథలు ఎన్నెన్నో చెపుతాడు గదా? తనంటే ఎంత ప్రేమ నాన్నకి! నాన్న తన్ను చూట్టానికి వచ్చిన రోజువుతే తనకి పండగే. తన్ను ఒక్క క్షణం విడిచి పెట్టడు. తన బుగ్గలన్నీ ముద్దులతో నింపేస్తాడు. తన స్కూలు సంగతులన్నీ అడుగుతాడు. ఎంచక్కా కథలు చెపుతాడు!

అమ్మమ్మయితే ఒకటే సణుగుతుంది — 'వచ్చిన దగ్గరినుంచీ ఆ పసిదాని తోనే లోకమా ఏమిటీ తిక్కశంకరయ్యకి? దానికికూడా తన తిక్క బుద్ధులన్నీ నేర్పిపోతాడేమో' అంటూ.

తను నాన్న దగ్గిర కూర్చుంటే తప్పేమిటి? రమా, వసంత, రాజా, సుధ వాళ్లంతా రాత్రిపూట మామయ్య మీద పడి ఎలా అల్లరి చేస్తారు? వాళ్లనేం అనదే అమ్మమ్మ?

వాళ్లకి మాత్రం ఎంత టెక్కు. ఎప్పుడూ వాళ్ల నాన్న వాళ్ల దగ్గిరే ఉంటాడని! మాటిమాటికి ఫోవే, ఫో, మా ఇంటికి అంటూ బెదిరిస్తారు. అప్పుడు తన కెంత ఏడుపొస్తుందని. ఒక్కసారిగా నాన్న దగ్గరికి పరుగెత్తి ఒళ్లో తల దాచుకోవా లనిపిస్తుంది.

మొన్న నేం జరిగిందని? పండక్కి నాన్న తెచ్చిన పల్లపూసల పరికిణీ కట్టు కుందని అమ్మమ్మయితే విరుచుకు పడింది. 'ఒసే, శైలా! పండక్కి అందరితో పాటు నీకుకూడా పట్టుపరికిణీ కుట్టించారు గదే! అది కట్టుకోకుండా ఈ చీటీ గుడ్డ పరికిణీ కట్టుకున్నావేమిటే! ఓ యబ్బ సంబడం! మీ నాన్న తెచ్చాడనా? మహా తెచ్చాడులే ఓ ముతగుడ్డ. విప్పి, పట్టుది కట్టుకో' అంటూ కొట్ట వచ్చింది.

పట్టు పరికిణీయే బాగుంటుందని ఏమయినా రూలుందా? తనకి నాన్న తెచ్చిన పరికిణీయే బాగుంటుంది. సుధా, వసంతా వాళ్లంతా ఎంత గేలి చేశారని ఆటల కెళ్లినప్పుడు?

'ఒసేవ్, చూడండేవ్, శైలా వాళ్ల నాన్న ఎంత మంచి పట్టు పరికిణీ తెచ్చాడో! పాపం, దానికి రబ్బరూ, పెన్సిలూకూడా తెచ్చి పెట్టాడేవ్' అంటూ తను ఏడిచేవరకూ వెక్కిరించారు. అత్తయ్య వచ్చి కేకలేసి అందర్నీ పంపించేసింది. ఈ ఇంట్లో అందరూ అంతే, ఒక్క అత్తయ్య తప్ప!

మామయ్య మాత్రం నాన్న వచ్చినప్పుడు చూసికూడా మాట్లాడడేం? భోజనాలు చేస్తున్నప్పుడుకూడా ఒక్క మాట మాట్లాడడు. పాపం. తన ఫ్రెండ్సు వస్తే మాత్రం గంటల తరబడి కబుర్లు చెపుతాడు. కాఫీ, టిఫిన్లు పెడతాడు. మరి నాన్నకి మాత్రం ఎలా ఉంటుం దేమిటి? పైగా నాన్నని గురించి ఎప్పుడూ తిడతాడు— 'ఉట్టి అసమర్థపు వెధవ. నిక్షేపం లాంటి ఉద్యోగం కాస్తా మానుకున్నాడు. ఇప్పుడు అడ్డమయిన ఉద్యోగాలు చేస్తున్నాడు' అంటూ. పాపం నాన్న మాత్రం కావాలని మానేశా డేమిటి? ఒంట్లో బాగుండక మానేసి ఉంటాడు. మామయ్య తను మాత్రం ఆఫీసుకు పోడుగా జ్వరం వస్తే, ఇంట్లోనే పడుకుంటాడు.

నిన్న నయితే తను క్లాసులో ఫస్టొచ్చా నని చెపితే 'ఆహా' అంటూ ఊరుకున్నాడు. అదే సుధ సెకండొచ్చానని చెపితే దాన్ని ఎన్ని ముద్దులు పెట్టుకున్నాడో. కొత్త బొమ్మకూడా కొని ఇచ్చాడు. అదే, నాన్నయితే తన్ని ఎంత ముద్దు చేసే వాడో!

రాజా, సుధ, వసు వాళ్లు ఏదయినా అడిగితే, వెంటనే ఇచ్చే మామయ్య, త నేదయినా అడిగితే — 'ఎందుకు? ఏమిటి?' అంటూ లక్ష ప్రశ్నలేస్తాడు. అందుకే తన కిక్కడ బాగుండదు. ఒక్క గదయినా నాన్న దగ్గరే బాగుంటుంది.

ఒకసారి నాన్న తనని బలవంతంగా తనతో తీసుకెళ్లాడు. ఒక్క గదిలో ఓ మూల దండెం మీద మాసి చిరుగు పట్టిన బట్టలు, కుక్కి మంచం, విరిగిన టేబులు. అవన్నీ చూసి తన కెంత జాలేసిందని! 'నాన్నా! నువ్వుకూడా మామయ్య దగ్గరకి వచ్చెయ్యకూడదూ?' అంటే నా న్నేమన్నారు?

'నా కక్కడ కంటే ఇక్కడే బాగుంటుంది, శైలూ' అంటూ వెక్కి తిరిగి కళ్లు తుడుచుకున్నాడు.

నాన్న తన దగ్గర కూర్చో పెట్టుకుని అన్నం తినిపిస్తూంటేనూ, తన చెయ్యి పట్టుకుని షికారు తీసుకెళ్లినప్పుడూ తన కెంత బాగుంటుందని!

నాన్నని బట్టలు చిరిగిపోయాయని, కొత్త బట్టలు కొనివ్వమని మామయ్యతో చెబుదామని ఎన్ని సార్లు ప్రయత్నించింది తను! ఒక్కసారికూడా బయటికి రాదే. చివరికి అమ్మతో చెబుతుంటే విని, మామయ్య ఎంతగా నవ్వాడు!— 'ఎందుకే మీ నాన్నకి కొత్త బట్టలు, శైలా? రేపేదయినా డబ్బవసరమయితే రెండు రూపాయలకి అమ్మేస్తాడే ఆ మహానుభావుడు' అంటూ. అప్పుడయితే తనకి మామయ్యని వీపు పగిలేట్టు కొట్టాలనిపించింది. నాన్నని చూసి ఎవరు నవ్వినా తన కలాగే అనిపిస్తుంది.



ఆలోచన

చిత్రం—జి. చంద్రశేఖర్ (మద్రాసు-1)

బడిలో మాత్రం అందరూ తన్ని చూసి, 'పాపం! శైలా వాళ్ల నాన్న వీళ్ల దగ్గరుండట్టే పాపం' అంటూ జాలి పడతారు. తన కెంత ఒళ్లు మండుతూందని!

ఉమా వాళ్ల నాన్న మాత్రం దాని దగ్గరుంటున్నాడేమిటి! వాళ్ల నాన్న అమెరికా వెళ్లి ఆరేళ్లయిందట. అయినా, దాన్నంతా ఎంత గొప్ప చేస్తారో!

ఎలాగయినా తను, నాన్న అమ్మ ఒక్క చోట ఉండాలి! ఎలాగబ్బా! ఏం చెయ్యాలి? అమ్మ నడుగుతే ఏడుస్తుంది. ఎలా? ఎలా?

ఆలోచనలతో అలిసిపోయిన చిన్నారి శైల క్రమంగా నిద్రలోకి జారిపోయింది. నిద్రపోయిన శైలకి దుప్పటి పరిగా కప్పి పక్కకి తిరిగి పడుకుంది పార్వతి.

• • •

ఆలోచనలతో ఆలస్యంగా నిద్ర పోయిన శైలకి, ఆదెమ్మగారు తోట పూలు కోస్తూ చదివే వెంకటేశ్వర సుప్రభాతంతో మెలుకువ వచ్చింది. కళ్లు మూసుకునే వింటూ పడుకుంది. పక్కింటి మీనాక్షి బామ్మగారు పూల కోసం వచ్చినట్టుంది. ఆవిడతో బాతాఖానీలో పడ్డారు ఆదెమ్మగారు. వింటూ పడుకున్న శైల, హఠాత్తుగా లేచివచ్చి కిటికీలో కూర్చుని వినసాగింది.

'విన్నావా, వదినా! నిన్న మా రమణ పనిమీద ఊరికెళ్లాట్ట. పార్వతి వాళ్లాయన్ని చూసొచ్చాట్ట. గుండెల్లో నొప్పిటమ్మా, వదినా! మంచం మీద పడుకుని ఒకటే బాధ పడుతున్నాట్ట. పక్కవాళ్లెవరో కాపడం పెడుతున్నారట. పాపం ఇంటిగలవాళ్లుకూడా మా రమణతో చెప్పారటమ్మా— ఆయన ఆరోగ్యం బాగుండటం లేదు. వాళ్ల వాళ్ల వెవ

ర్నాయినా రమ్మని, ఆమటా అంటూ! శైలా ఎలా ఉంది అంటూ వంద సార్లడిగాట్ట మా రమణని.'

'అవునట, వదినా! మా పార్వతికూడా కిందటిసారి చెప్పింది— గుండెల్లో నెప్పి వస్తోందంటున్నాడని. ఏం చేస్తాం చెప్పొదినా? మా ఖర్మ, దాని రాత అట్లా ఉన్నాయి. దాని అయిదో తనం గట్టిదవ్వాల్సిందే తప్ప, ఎవరే మేం చెయ్యగలం చెప్పు, వదినా! అతని కేమో ఆ చిన్నదానిమీద బెంగమ్మా, వదినా! తనకే టికాణా లేనివాడు వీళ్లని తీసుకెళ్లి ఏం చేస్తాడమ్మా — పోనీ పంపిద్దామన్నా? ఈ వేళొచ్చే ఏభయి రూపాయలు రేపొస్తాయో లేదో నమ్మకం లేదయ్యే. ఏ క్షణాన తిక్క పుట్టినా, ఆ కాస్త పనీ మానేసి ఇంటిపట్టున కూచుంటాడయ్యే. మేం మాత్రం ఏం చెయ్యగలం చెప్పొదినా? ఇక్కడుంటే పిల్లా అదీ కూటికీ, గుడ్డకీ లోపం లేకుండా ఉంటారు. పోనీ, వీళ్లందర్నీ అక్కడే పెట్టి కనిపెట్టి చూద్దామన్నా మా మూర్తి మాత్రం ఎంతకని బరువు మొయ్యగల డొదినా? వాడిదీ పెరుగుతున్న సంసారం, ఖర్చులు . . .'

అనర్గళంగా సాగిపోతూంది ఆదెమ్మ గారి వాక్ప్రవాహం. 'అంతా డబ్బు మహిమతే, వదినా! ఇంతకీ పార్వతి దురదృష్టవంతురాలు. వస్తా. రమణకి ఆఫీసు టయమవుతూంది' అంటూ పక్కింటి బామ్మగారు వెళ్లిపోయింది.

కళ్లనించి ధారగా కారుతున్న నీటిని కూడా గుర్తించకుండా రాతిబొమ్మలా కూర్చుండిపోయింది శైల. మంచంలో బాధతో కొట్టుకుంటున్నంత తండ్రి రూపమే ఆ చిన్నారి కళ్లముందు కదులుతూంది. 'శైలా', 'శైలా' అంటూ తండ్రి పిలుపే వినపడుతూంది.

'ఏమిటి, శైలమ్మా, అట్టా కూకుం డావు పొద్దున్నే. ఇయాళ బడి కెలపేంటి?' గది ఊడుస్తున్న అప్పి పిలుపుతో ఈ లోకంలో పడింది శైల.

కళ్లు తుడుచుకుని దానివైపే చూస్తూ కూచుంది మౌనంగా. నీటి లోని చేపపిల్లల్లాగా ఆ చిన్న తలలోని ఆలోచనలు పరుగెత్తుతున్నాయి.

'ఒసేవ్, అప్పీ, మాట' అన్న శైల పిలుపుతో, అప్పి చీపురుకట్ట పుచ్చుకుని దగ్గరగా వచ్చి నించుంది, ఏమిటన్నట్లు చూస్తూ.

'నీ కెంతే జీతం?' గంభీరంగా వచ్చిన ప్రశ్నకి విస్తుపోయింది అప్పి. బొద్దుగా, ముద్దుగా ఉండే శైలజ అంటే దానికి ప్రాణం. తండ్రి దగ్గరలేని పిల్లని జాలి.

'ఏదేనుగానీ, నా జీతం ఊసెందుకు, శైలమ్మా!'

'మీ ఆయనేం పని చేస్తాడే? డబ్బు బాగా వస్తుందా?'

'ఆడు రిచ్చా లాగుతాడు గదమ్మా! మ వ్వెన్ని సార్లెక్కినావు ఆడి రిచ్చా?'

'డబ్బెంతొస్తుందే? వాడికి?' బుగ్గని చెయ్యి పెట్టుకుని నిదానంగా అడుగుతున్న శైలాని విచిత్రంగా చూస్తూ జవాబు చెప్పింది అప్పి.


మూత్రము తరచుగా విసర్జిస్తున్నారా?

(Sal Sal Bool)

"యూరిటోన్ బిళ్ళలు" ప్రాచీన కాలం నుండి ప్రఖ్యాతి చెందిన యూనాని వైద్య విధానములో అపూర్వమైన వనమూలికలు, ఓషధులతోను, కషాయములతోను, శాస్త్రీయంగా తయారైన బిళ్ళలు— ఈ వ్యాధిని నిర్మూలించ గలవు.

"యూరిటోన్" పొదుపైనది. నిరపాయమైనది. సులభంగా తీసుకోవచ్చును. ప్రత్యేక ఆహార నియమాలు లేవు. సామాన్య ఆరోగ్యము కలవారు కూడా ఈ మందులో శక్తి నిచ్చే గుణము గలదు గాన, వాడవచ్చును. వివరముల క్యాటలాగుకు వ్రాయండి. ఉచితంగా పంపెదము.

ధర: 40 బిళ్ళలుగల సీసా రు. 10/- మాత్రమే. ప్యాకింగ్ అండ్ పోస్టేజి రు. 2/—లు అదనం. ఒకే తఫా 2 లేక అంతకు ఎక్కువ సీసాలకు ఆర్డరు పంపువారికి పోస్టేజి ఉచితం.

**BARRYS (HERBAL) LABORATORIES, (A.P.W.), G. P. O. Box No. 107, CALCUTTA.**



రు. 15/— లకు మాత్రమే రేడియో



మా కొత్త స్కీము కింద మీరు బ్యాటరీ సెల్సుతో పనిచేసే పాకెట్ ట్రాన్సిస్టర్ పొందవచ్చును. పార్టులు జపానులో తయారు చేయబడినవి. సంగీతం, వార్తలు, వగైరా ప్రపంచంలో ఎక్కడైనను స్థానికంగా వినండి. పోస్టేజి రు. 3/—. వి. పి. పి. పార్సెల్ కొరకు వ్రాయండి. ఆమోదించబడకపోతే వెల తిరిగి చెల్లించబడుతుంది.

**BUNTY RADIOS (B-9), Durgiana, Amritsar.**





